క్లుప్తంగా

14 వరకు హనుమాన్ జయంత్యుత్సవాలు

మార్కాపురం టౌన్: పట్టణంలోని కంభం రోడ్డులో నాగులపుట్ట వీరాంజనేయస్వామి దేవస్థానంలో బుధవారం హనుమాన్ జయంత్యుత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ నెల 14 వరకు ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు గౌరవ అధ్యక్షులు యక్కలి కాశీవిశ్వనాథం, అధ్యక్షుడు నూకల శ్రీనివాసులు, కార్యదర్శి గోపిశెట్టి కొండయ్య, కోశాధికారి తాళ్లపల్లి ఆదినారాయణ తెలిపారు. స్వామివారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

నల్లమల ఘాట్‌లో లారీ బోల్తా

గిద్దలూరు రూరల్: గిద్దలూరు మండలం దిగువమెట్ట గ్రామ సమీపంలోని నల్లమల ఘాట్‌లో సిమెంట్ లోడు లారీ బోల్తా పడిన సంఘటన బుధవారం జరిగింది. అందిన వివరాల ప్రకారం.. నంద్యాల నుంచి గిద్దలూరు వైపు వస్తున్న సిమెంట్ లోడు లారీ ప్రమాదవశాత్తు మలుపు వద్ద బోల్తా కొట్టింది. ప్రమాదంలో అదృష్టవశాత్తు ఎవరికీ ఎటువంటి ప్రమాదం సంభవించలేదు. లారీ రోడ్డుకు అడ్డంగా పడటంతో ట్రాఫిక్ సమస్య తలెత్తింది. సమాచారం అందుకున్న పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

అమ్మవారి ఆలయంలో చోరీ

గిద్దలూరు రూరల్: మండలంలోని ఉయ్యాలవాడ పంచాయతీ అంకాలమ్మపల్లె అంకాలమ్మ ఆలయంలో దొంగలు చోరీకి పాల్పడిన సంఘటన బుధవారం వెలుగుచూసింది. అందిన వివరాల ప్రకారం.. దొంగలు ఆలయంలోకి ప్రవేశించి అమ్మవారి వెండి కిరీటం, హుండీలోని నగదు అపహరించుకెళ్లినట్లు స్థానికులు తెలిపారు.

వేసవిలో జాగ్రత్తలు అవసరం

కొనకనమిట్ల: వేసవిలో వడదెబ్బ బారిన పడకుండా విద్యార్థులు, అంగన్‌వాడీ కేంద్రాల చిన్నారులు, బాలింతలు, గర్భిణులు, వృద్ధులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కొనకనమిట్ల, గొట్లగట్టు ప్రభుత్వ వైద్యాధికారులు ఎస్వీ బాలయ్య, పృథ్వీరాజ్ సూచించారు. వడదెబ్బ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియజేశారు. మధ్యాహ్న సమయంలో బయటకు రాకూడదని చెప్పారు. అత్యవసర సమయంలో రావాల్సి వస్తే గొడుగు, తువాలు వినియోగించాలని సూచించారు. కూల్‌డ్రింకులు కాకుండా చలువ పానీయాలు, మజ్జిగ ఎక్కువగా తీసుకోవాలని, పౌష్టికాహారం తినాలని స్పష్టం చేశారు. వడదెబ్బకు గురైతే ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు వాడాలన్నారు. తీవ్రతను బట్టి 108 వాహనంలో ప్రభుత్వ వైద్యశాలకు రావాలని డాక్టర్లు సూచించారు.

గడ్డి నుంచి లభించే నూనెలు తెలుసుకోవాలి

గిద్దలూరు రూరల్: రైతులు గడ్డి నుంచి లభించే నూనెల ప్రాముఖ్యతను తెలుసుకుని ఉండాలని ఉద్యాన శాఖాధికారి శ్వేత అన్నారు. మండలంలోని ముండ్లపాడులో ఉద్యాన శాఖాధికారులు బుధవారం రైతులకు గడ్డి నుంచి లభించే నూనెల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు, సలహాలు తెలియజేశారు. ఆరోమా మిషన్ ఫేస్ త్రీలో ముఖ్యమైన నూనె ఆధారిత సుగంధ పరిశ్రమలను ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు. దీనిలో భాగంగా రైతులకు అవగాహన కల్పించేందుకు ఈ నెల 24వ తేదీన శాస్త్రవేత్తలతో అవగాహన కార్యక్రమం ఉంటుందన్నారు. ఉద్యానశాఖ సిబ్బంది రవిచంద్రుడు, రైతులు పాల్గొన్నారు.

రీ సర్వే ప్రారంభం



డ్రోన్ సర్వేను ప్రారంభిస్తున్న నాయకులు

కురిచేడు: మండలంలోని దేకనకొండలో రీసర్వే బుధవారం ప్రారంభమైనట్లు తహసీల్దార్ షేక్ నాగూల్‌మీరా తెలిపారు. రీ సర్వే టీమ్ మండలంలోని అన్ని గ్రామాల్లో పర్యటిస్తారని పేర్కొన్నారు. సర్పంచ్ యర్రగుంట్ల కీర్తి కొబ్బరికాయ కొట్టి డ్రోన్ ఫ్లయి కార్యక్రమానికి స్వాగతం పలికారు. ఎంపీపీ బెల్లం కోటేశ్వరమ్మ, రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ ఆర్.శ్రీకాంత్, మండల సర్వేయరు పి.నాగేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధం



దగ్ధమవుతున్న పూరిల్లు

పుల్లలచెరువు: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధమైంది. ఈ సంఘటన మండల కేంద్రం పుల్లలచెరువులో బుధవారం రాత్రి జరిగింది. వివరాలు.. ఈర్ల వెంకటాద్రి అనే వ్యక్తి కొంత కాలంగా సమీపంలోని ఆంజనేయ స్వామి గుడిలో పూజారిగా ఉంటూ పక్కనే పూరిల్లు వేసుకుని జీవనం సాగిస్తున్నాడు. గుడిలో పూజలు చేసేందుకు వెళ్లగా విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పూరింటికి మంటలు అంటుకుని పూర్తిగా దగ్ధమైంది. ఇంట్లో ఉన్న చిన్న గ్యాస్ సిలిండర్ పేలింది. స్థానికులు వచ్చి మంటలార్పారు. పక్కన ఇళ్లు లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. సుమారు లక్ష రూపాయల మేరకు నష్టం జరిగినట్లు బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు.

హామీలను నెరవేర్చిన ఘనత జగనన్నదే

● ఎమ్మెల్యే అన్నా రాంబాబు



మహిళకు సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే అన్నా

కొమరోలు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పొందుపరిచిన హామీలన్నింటినీ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నెరవేర్చారని గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు అన్నారు. తాటిచెర్ల గ్రామ సచివాలయం పరిధి నాగిరెడ్డిపల్లి, ముత్రాసుపల్లె గ్రామాల్లో బుధవారం నిర్వహించిన 104వ రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఎమ్మెల్యే ఆయా గ్రామాల్లోని ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని వివరించడంతో పాటు స్థానికంగా ఉన్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఎమ్మెల్యే రాంబాబు మాట్లాడుతూ ప్రజలకు ఏ సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకొస్తే తక్షణమే పరిష్కారం అయ్యేలా చూస్తానని హామీ ఇచ్చారు. కరోనా కష్టకాలంలోనూ ప్రజలు ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో సంక్షేమ పథకాలను రాష్ట్ర ప్రభుత్వం ఎక్కడా ఆపలేదన్నారు. అమ్మఒడి, వైఎస్సార్ పింఛన్ కానుక, చేయూత, ఆరోగ్యశ్రీ, ఆసరా, వాహనమిత్ర, విద్యా దీవెన, వసతి దీవెనతో పాటు పేదలకు ఇళ్లు వంటి హామీలు సమర్థంగా అమలు చేస్తున్నారని గుర్తు చేశారు. మూడున్నరేళ్ల పాలనలో జరిగిన అభివృద్ధిని చూసి మరోసారి వైఎస్సార్ సీపీని గెలిపించాలని ఎమ్మెల్యే ప్రజలను కోరారు. జెడ్పీటీసీ సభ్యుడు సారె వెంకట నాయుడు, సర్పంచ్ బొమ్మని రంగమ్మ, ఎంపీటీసీ షేక్ సుభానీ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మోహన్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు బాదం వేణుగోపాల్, బొమ్మని వెంకటేశ్వర్లు, అలెగ్జాండర్, బాలసుబ్బయ్య, తిరుపాలు, రంగస్వామిరెడ్డి, శేషారెడ్డి, పుల్లయ్య, ఎంపీడీవో నరసయ్య, ఏపీఎం పాండురంగప్రసాద్, హౌసింగ్ ఏఈ కృష్ణారెడ్డి, ఎంఈవో వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు

రూ.97.70 లక్షలు మంజూరు

యర్రగొండపాలెం: రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ చొరవతో రూ.97.70 లక్షలు సీఎండీఎఫ్ నిధులు నియోజకవర్గ అభివృద్ధికి మంజూరయ్యాయి. రూ.31.50 లక్షలతో రోడ్ల అభివృద్ధి, రూ.66.20 లక్షలతో తాగునీటి అవసరాలు తీర్చేందుకు ఖర్చు చేయనున్నట్లు ఆయా శాఖల అధికారులు తెలిపారు. త్రిపురాంతకం మండలం సోమేపల్లిలో సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.2.50 లక్షలు, రెడ్ల అన్నదాన సత్రం వరకు సీసీ రోడ్డుకు రూ.5 లక్షలు, పుల్లలచెరువు మండలం నాయుడుపాలెం ఎస్సీ కమ్యూనిటీ బరేల్ గ్రౌండ్ వరకు గ్రావెల్ రోడ్డు నిర్మాణానికి రూ.4 లక్షలు, పుల్లలచెరువు ఎస్సీ కాలనీలో సీసీ రోడ్డుకు రూ.5 లక్షలు, పెద్దదోర్నాల మండలం జమ్మిదోర్నాల రోడ్డుకు రూ.5 లక్షలు, యర్రగొండపాలెం మండలం గంగపాలెం సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.5 లక్షలు, పెద్దారవీడు మండలం రేగుమానిపల్లె గ్రావెల్ రోడ్డుకు రూ.5 లక్షలు చొప్పున మంజూరయ్యాయి. తాగునీటి అవసరాలు తీర్చేందుకు త్రిపురాంతకం మండలం ఎండూరివారిపాలెంలో ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేసేందుకు రూ.5 లక్షలు, పుల్లలచెరువు మండలం వెంకటరెడ్డిపల్లె రామాలయం వీధిలో బోర్‌వెల్ ఏర్పాటు చేసేందుకు రూ.3 లక్షలు, మర్రివేములలో బోర్‌వెల్‌కు రూ.2.50 లక్షలు, తెలగట్లలో పైప్‌లైన్‌కు రూ.2 లక్షలు, చెన్నంపల్లిలోని ఎస్సీ పాలెంలో డీప్‌బోర్‌కు రూ.4.50 లక్షలు, సి.కొత్తపల్లి వద్ద డీప్‌బోర్‌కు రూ.4.50 లక్షలు, చిన్న పీఆర్సీ తండాలో బోర్‌వెల్, సింగిల్ ఫేస్ మోటార్‌కు రూ.3 లక్షలు, యర్రగొండపాలెం మండలం అమానిగుడిపాడు ఎస్సీ పాలెంలో నీటి అవసరాలకు రూ. 5 లక్షలు, గంగపాలెంలో బోర్‌వెల్, మోటారుకు రూ.3 లక్షలు, అయ్యంభొట్లపల్లె బోర్‌వెల్‌కు రూ.3.50 లక్షలు, యర్రగొండపాలెం ఇందిరమ్మ కాలనీలో డీప్‌బోర్ ఏర్పాటుకు రూ.3.30 లక్షలు, నరసాయపాలెంలో బోర్‌వెల్‌కు రూ.3.30 లక్షలు, పెద్దదోర్నాల మండలం రామచంద్రకోటలో డీప్ బోర్‌వెల్, సింగిల్ ఫేస్ మోటారు ఏర్పాటుకు రూ.3.90 లక్షలు, చిన్నదోర్నాల ఎస్సీ పాలెంలో డీప్‌బోర్‌వెల్‌కు రూ. 3.50 లక్షలు, కటకానిపల్లె ఎస్సీ పాలెంలో నీటి అవసరాలు తీర్చేందుకు రూ.4.20 లక్షలు, చిన్నగుడిపాడు బీసీ కాలనీలో డీప్‌బోర్ ఏర్పాటుకు రూ.3.50 లక్షలు చొప్పున మంజూరయ్యాయి. పెద్దారవీడు మండలం చాట్లమడ అగ్రహారంలో డీప్‌బోర్ వెల్‌కు రూ.4.50 లక్షలు, పెద్దారవీడులో తాగు నీటి సదుపాయం కల్పించేందుకు రూ. 4 లక్షలు చొప్పున మంజూరయ్యాయని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ రామకృష్ణ వివరించారు.

వేడుకగా వేణుగోపాలస్వామి కల్యాణం



పోలేరమ్మ మూలవిరాట్



కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

కొనకనమిట్ల: మండల కేంద్రం కొనకనమిట్ల సమీపంలోని రామదూత క్షేత్రంలో 11వ శ్రీరామనామ సప్తాహ మహోత్సవాలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా బుధవారం రామదూత క్షేత్ర నిర్వాహకులు, వేదపండితులు అకలంకం వెంకటరామకృష్ణాచార్యులు ఆధ్వర్యంలో హోమాలు, అభిషేకాలు, అర్చనలు చేశారు. అనంతరం శ్రీరుక్మిణి సత్యభామ సహిత శ్రీవేణుగోపాల కృష్ణస్వామి కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. కల్యాణ ఉభయ దాతలుగా ఎం.రమేష్ బాబు, నివేదిత, జి.ఆంజనేయులు, మూర్తెమ్మ దంపతులు వ్యవహరించారు. ఉత్సవాలను గ్రామ ప్రజలతో పాటు పరిసర గ్రామాల ప్రజలు తిలకించారు. కల్యాణం అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. నేడు వెంకటేశ్వరస్వామి కల్యాణం నిర్వహిస్తామని, ఈ నెల 14వ తేదీతో సప్తాహ మహోత్సవాలు ముగుస్తాయని ఆలయ కమిటీ సభ్యులు వెంకటరామకృష్ణ, యక్కంటి తిరుపతిరెడ్డి తెలిపారు.

భక్తిశ్రద్ధలతో పోలేరమ్మ తిరునాళ్ల



అమ్మవారికి మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

కురిచేడు: మండల సరిహద్దులో ఉన్న నరసాయపాలెం పోలేరమ్మ తిరునాళ్ల బుధవారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రకాశం, పల్నాడు జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. రైతులు తమ ట్రాక్టర్లు, గొర్లను తీసుకొచ్చి అమ్మవారి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేయించారు. భక్తుల సౌకర్యార్థం తాగునీరు, అన్నదానం చేశారు. రాత్రికి విద్యుత్ ప్రభలు ఏర్పాటు చేసి సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు.

అవంతికకు ఘన సన్మానం



అవంతికను సన్మానిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

మార్కాపురం: మలేషియా రాజధాని కౌలాలంపూర్‌లో ఏర్పాటు చేసిన భరత నాట్య ప్రదర్శనలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన చిన్నారి అవంతికను స్థానిక బీసీ భవన్‌లో బుధవారం వైఎస్సార్ సీపీ నేతలు ఘనంగా సన్మానించారు. వైఎస్సార్ సీపీ బీసీ విభాగం రాష్ట్ర కార్యదర్శి పీఎల్పీ యాదవ్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కేపీ సోదరుడు కృష్ణమోహన్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ బాలమురళీకృష్ణ, పార్టీ రాష్ట్ర కార్యదర్శి షంషేర్ అలీ బేగ్, నియోజకవర్గ బీసీ సంఘ అధ్యక్షుడు రంగస్వామి గౌడ్, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ కొండయ్య, బీసీ సంఘం నాయకులు అచ్చయ్య, శ్రీనివాసులు, చక్రపాణి, న్యాయవాది బూపని కాశయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా పాలిసెట్ పరీక్ష



విద్యార్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది



పరీక్ష రాస్తున్న విద్యార్థులు

మార్కాపురం: మార్కాపురం పట్టణంలో బుధవారం మూడు కేంద్రాల్లో పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష(పాలిసెట్-2023) ప్రశాంతంగా జరిగింది. పరీక్ష కేంద్రాలకు కోఆర్డినేటర్‌గా పి.ప్రభాకర్ రావు, అడిషనల్ కోఆర్డినేటర్‌గా డాక్టర్ సీహెచ్ రాజబాబు, అబ్జర్వర్‌గా ఎస్.రాజగోపాల్‌రెడ్డి వ్యవహరించారు. శామ్యూల్ జార్జి ఇంజినీరింగ్ కళాశాల పరీక్ష కేంద్రంలో 638 మందికిగాను 557 మంది, బాలుర ఉన్నత పాఠశాల కేంద్రంలో 400 మందికిగాను 342 మంది, బాలికోన్నత పాఠశాలలో 350 మందికిగాను 318 మంది హాజరైనట్లు కోఆర్డినేటర్ ప్రభాకర్‌రావు వివరించారు. పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థులను పూర్తిగా తనిఖీ చేసి లోపలికి పంపించారు. కేంద్రాల వద్ద పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

స్వర్ణ చెరువులో చేపలు మృతి

స్వర్ణ (కారంచేడు): మండలంలోని స్వర్ణ గ్రామపంచాయతీ పరిధిలోని తాగునీటి చెరువులో బుధవారం వేకువజామున చేపలు మృతి చెందాయి. దీంతో చేపలు చనిపోయి నీటిపై తేలాడంతో గమనించిన గ్రామస్తులు ఆందోళన చెందారు. నీరు కలుషితం కావడం వలన చనిపోయి ఉంటాయని అనుమానం వ్యక్తం చేశారు. గ్రామ కార్యదర్శి శ్రీనివాసరావు తన సిబ్బందితో చనిపోయిన చేపలను పట్టించి ఊరు చివరన పారబోయించారు. తాగునీటి చెరువులో నీరు కలుషితం కావడం వలన కాదని, వేసవి దృష్ట్యా ఆక్సిజన్ శాతం తక్కువగా ఉండటం వలనే ఈ చేపలు చనియోయాయని, ప్రజలు ఎవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదని కార్యదర్శి అన్నారు. వెంటనే చెరువులో బ్లీచింగ్ చేయించామన్నారు. నీటిని పరీక్షల నిమిత్తం పంపిస్తామన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో పాటు, మత్స్య శాఖ అధికారులకు కూడా తెలియజేశామన్నారు.



స్వర్ణ చెరువులో చనిపోయి పైకి తేలుతున్న చేపలు

ఘనంగా మున్సిపల్ చైర్మన్ జన్మదిన వేడుకలు



మున్సిపల్ చైర్మన్ కృష్ణను సన్మానిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

మార్కాపురం టౌన్: మార్కాపురం మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణ జన్మదిన వేడుకలు బుధవారం పట్టణంలోని బీసీ భవన్‌లో, మున్సిపల్ కౌన్సిల్ హాల్లో, చైర్మన్ చాంబర్‌లో ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర బీసీ కమ్యూనిటీ అసోసియేషన్ అధ్యక్షుడు పీఎల్‌పీ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి సోదరుడు కృష్ణమోహన్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి షంషేర్ అలీబేగ్, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ నల్లబోతుల కొండయ్య, న్యాయవాది భూపన్ కాశయ్య, బీసీ సంఘ నాయకులు శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు. ఎమ్మెల్యే నాగార్జున రెడ్డి సహకారంతో మార్కాపురం పట్టణాభివృద్ధికి కృషి చేస్తునట్లు తెలిపారు. మున్సిపల్ కౌన్సిల్ హాల్లో కౌన్సిలర్లు సిరాజ్, హర్షిత బాబీ, ఉత్తమ కుమార్, మయూరి కాశీం, కొత్త కృష్ణ, నగేష్, ముత్తారెడ్డి వెంకటరెడ్డి, బూదాల సతీష్, రోజ్ లీడియా తదితరులు పాల్గొని సన్మానించారు.

చోరీ కేసులో నిందితుడు అరెస్టు

కంభం: మండలంలోని ఔరంగబాద్‌లో మంగళవారం ఇంటి తాళం పగలగొట్టి రూ.50 వేల నగదు అపహరించిన నిందితుడిని బుధవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎస్సై నాగమల్లేశ్వరరావు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన చిట్టెంశెట్టి శశికుమార్ చోరీకి పాల్పడినట్లు గుర్తించి, అదుపులోకి తీసుకొని గిద్దలూరు కోర్టులో హాజరుపరిచినట్లు పేర్కొన్నారు.

నాడు-నేడు అభివృద్ధి పనుల తనిఖీ



పనులు తనిఖీ చేస్తున్న సూర్యనారాయణ

త్రిపురాంతకం: నాడు-నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను రాష్ట్ర క్వాలిటీ కంట్రోల్ ఇంజినీరింగ్ అధికారి సూర్యనారాయణ తనిఖీ చేశారు. త్రిపురాంతకం కేజీబీవీ, మెయిన్, స్పెషల్, ఎస్ఎస్‌సీ, గణపవరం పాఠశాలల భవనాల పనులను ఆయన తనిఖీ చేశారు. పనుల క్వాలిటీ, పెట్టిన ఖర్చులు, రికార్డులు పరిశీలించారు. ఈయన వెంట ఎంఈఓ కె.తులసిమల్లికార్జున నాయక్, ఇంజినీరింగ్ అధికారులు మహేష్, భూపాల్‌రెడ్డి, ఇంజినీరింగ్ అసిస్టెంట్ నరసింహారెడ్డి, ప్రధానోపాధ్యాయుడు ఆవుల వెంకటేశ్వర్లు, అచ్చయ్య, నరేష్, ఆదినారాయణరెడ్డి ఉన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఒంగోలు: స్థానిక డీఎస్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీలో డిగ్రీ విద్యనభ్యసించేందుకు ఆసక్తి గల విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ డి.కల్యాణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక భాగ్యనగర్ 11వ లైనులో ఉన్న తమ కాలేజీలో బీఏ (హిస్టరీ, ఎకనామిక్స్, పాలిటిక్స్), బీఎస్సీ (బోటనీ, జువాలజీ, కెమిస్ట్రీ), బీఎస్సీ (ఆక్వాకల్చర్, జువాలజీ, కెమిస్ట్రీ), బీఎస్సీ (మ్యాథ్స్, ఫిజిక్స్, కంప్యూటర్ సైన్స్), బీఎస్సీ (మ్యాథ్స్, క్లౌడ్ కంప్యూటింగ్, కంప్యూటర్ సైన్స్), బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్ కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రతి కోర్సులో 30 సీట్లు ఉన్నాయని, ఇంటర్ ఉత్తీర్ణులైన విద్యార్థినులు తమ కళాశాలను సందర్శించి దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అర్హులైన విద్యార్థులకు ఉచిత వసతి సదుపాయం ఉందన్నారు. టెక్నాలజీ పరంగా ఉద్యోగ అవకాశాలు కూడా విద్యార్థినులు అందుకుంటున్నారని, ప్రభుత్వం నిర్ణయించిన జగనన్న విద్యాదీవెన, జగనన్న వసతి దీవెను వంటి పథకాలు వర్తిస్తాయని పేర్కొన్నారు.

ఈకేవైసీ చేసుకుని పీఎం కిసాన్ పొందండి



రైతులతో మాట్లాడుతున్న ఏఓ

దొనకొండ: రైతులు తప్పని సరిగా ఈకేవైసీ చేసుకుని పీఎం కిసాన్ నిధులు పొందాలని మండల వ్యవసాయాధికారి ఎస్.లక్ష్మీనారాయణ తెలిపారు. బుధవారం మండలంలోని వెంకటాపురం, పెదన్నపాలెం, ఇండ్లచెరువు గ్రామాల్లోని రైతులతో ఆయన మాట్లాడారు. మండలంలో నేటికి 1957 మంది రైతులు ఈకేవైసీ చేసుకోలేదని స్పష్టం చేశారు. ఆర్‌బీకేల్లో తమ సిబ్బంది రైతుల కోసం అన్ని వేళల్లో అందుబాటులో ఉంటారని, ఈకేవైసీ చేసుకునే వారు ఆర్‌బీకేను సంప్రదించాలన్నారు. పీఎం కిసాన్ నిధులు ఈకేవైసీ చేసుకున్న వారికి ప్రతి ఏడాది రూ.6 వేలు అకౌంట్‌లో జమ అవుతాయన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏఓ తెలిపారు.